సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 29 । మే । 2025



రుచి మధురం.. రైతుకు లాభం

మామిడి తోటల నుంచి అధిక దిగుబడి సాధించడానికి రైతులు అనేక చర్యలు చేపడతారు. కాయలు రాలిపోకుండా, బాగా పెరిగేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటారు.


8లో



రూ.1,01,116 విరాళం

పి.గన్నవరం: మానేపల్లిలోని అయ్యప్పస్వామి ఆలయానికి చాకలిపాలెం గ్రామానికి చెందిన బళ్ల శ్రీరామచంద్రమూర్తి, సత్యవేణి దంపతులు బుధవారం రూ.1,01,116 విరాళం అందజేశారు.

10,778 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 10,778 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.40 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

రాష్ట్ర పండగగా ఎన్టీఆర్ జయంతి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎన్టీఆర్ జయంతిని మొదటిసారి రాష్ట్ర పండగగా జరుపుకొంటున్నామని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ లో బుధవారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, సమాచార పౌర సంబంధాల అధికారి, కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కేవలం కథానాయకుడు మాత్రమే కాదని, ఒక పరిపూర్ణమైన నటుడని అన్నారు. రావణాసురుడు, దుర్యోధనుడు వంటి ప్రతినాయక పాత్ర లను కూడా ప్రేక్షకులు మెచ్చేలా నటించడం ఎన్టీఆర్‌కే సాధ్యమైందని చెప్పారు. స్త్రీలకు ఆస్తి హక్కు దక్కేలా చట్ట సవరణ చేశారని, జనతా వస్త్రాలు రేషన్ షాపుల ద్వారా అందించారని, చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడానికి కృషి చేశారని చెప్పారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియామకం పొందిన కె.ఎస్.జవహర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీపీటీఓగా మూర్తి బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం సిటీ: తూర్పుగోదావరి జిల్లా డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌గా వైఎస్‌ఎన్ మూర్తి బుధవారం రాజమహేంద్రవరంలో బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ డీపీటీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఉమ్మడి జిల్లాల ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎర్రంశెట్టి కొండలరావు అభినందనలు తెలిపారు.

లోవ హుండీల ఆదాయం రూ.42.28 లక్షలు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.42,28,835 ఆదాయం లభించినట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. బుధవారం కాకినాడ భీమేశ్వరస్వామి గ్రేడ్–2 ఈఓ ఆర్.రాజేశ్వరరావు, సిరిపురం గ్రూపు టెంపుల్స్ గ్రేడ్–3 కార్యనిర్వహణ అధికారి ఎం.సూర్య రమణి సమక్షంలో హుండీలను తెరిచి పంచలోహ విగ్రహాల ప్రాంగణంలో నగదు లెక్కించినట్టు ఈఓ తెలిపారు. నాణేలు రూ.2,66,236, నోట్లు రూ.39,62,600 వచ్చాయన్నారు. లెక్కింపులో గోదావరి చైతన్య బ్యాంకు సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

చేతివాటం ప్రదర్శించిన ఉద్యోగి సస్పెన్షన్



చేతివాటంతో సస్పెండైన రమణ

హుండీల ద్వారా భక్తులు సమర్పించిన నగదును లెక్కింపులో తస్కరించిన దేవస్థానం అటెండర్ ఎల్.ఎస్.వి.రమణను సస్పెండ్ చేసినట్టు ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో 109 నోట్లు ఉన్న రూ.500 కట్టను తస్కరించినట్టు సిబ్బంది గుర్తించారని, ఈ విషయం సీసీ ఫుటేజ్‌లోను స్పష్టమయినట్టు ఈఓ తెలిపారు. చోరీకి పాల్పడిన రమణపై తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం విధుల నుంచి తొలగించామన్నారు.

ఆత్మహత్యాయత్నం

నేరారోపణకు గురైన అటెండర్ ఎల్ఎస్‌వీ రమణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనను సస్పెండ్ చేయడంతో మనస్తాపం చెందిన రమణ దేవస్థానం మూడో అంతస్తు నుంచి కిందకు (వినాయకుడి గుడి) వద్దకు దూకేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రమణను సహ ఉద్యోగులు తుని ఏరియా ఆస్పత్రికి అక్కడ నుంచి కాకినాడలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయమవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

గోదావరిలో క్రాంతి కిరణ్ మృతదేహం లభ్యం

ముమ్మిడివరం: కమిని పంచాయతీ శివారు సలాదివారిపాలెంలోని గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన యువకుల్లో సబ్బతి క్రాంతి కిరణ్ మృతదేహం బుధవారం ఉదయం సంఘటన స్థలంలో లభ్యమైంది. కె.గంగవరం మండలం శేరిల్లంకలో స్నేహితుడి ఇంట సోమవారం జరిగిన ఓణీ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఎనిమిదిమంది యువకులు గోదావరిలో గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో ఏడుగురి మృతదేహాలు మంగళవారం దొరికాయి. సబ్బతి క్రాంతి కిరణ్ మృతదేహాన్ని బుధవారం పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కనుగొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆయన క్రాంతి కిరణ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎర్రగరువుకు చెందిన అన్నదమ్ములు వడ్డి మహేష్, వడ్డి రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ధాన్యం.. దైన్యం

- ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం విఫలం
- తొలుత 2.50 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు నిర్ణయం
- రైతుల వ్యతిరేకతతో మరో లక్ష టన్నులు కొంటామని గొప్పలు
- కొన్న దానికి నేటికీ అందని నగదు
- ఏప్రిల్ 22 నుంచి నిరీక్షిస్తున్న రైతులు
- జిల్లావ్యాప్తంగా రూ.148 కోట్ల బకాయి



సాక్షి, రాజమహేంద్రవరం: ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు రైతులకు శాపాలుగా మారాయి. ఆశించిన మేర ధాన్యం కొనుగోలు చేయకపోవడం.. సేకరించినా సకాలంలో డబ్బులు జమ చేయకపోవడంతో ఆర్థిక కష్టాలతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. 'ధాన్యం రైతులకు ప్రోత్సాహం అందిస్తాం.. రైతు పండించిన ప్రతి గింజా కొంటాం. లక్ష్యానికి మించి ధాన్యం సేకరిస్తున్నాం.' అంటూ కూటమి నేతలు చేసిన వాగ్దానాలు నీటిమూటలుగా మారుతున్నాయి. ధాన్యం కొని చేసి నెల రోజులు కావస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు తీర్చలేక రైతులు నానా అవస్థలూ పడుతున్నారు. మరి కొంత మంది ఎప్పుడు కొంటారా అంటూ కళ్లాల్లో నిల్వలు ఉంచుకుని ఎదురు చూస్తున్నారు. ఇటీవలి వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయి. వాటిని ఎలా విక్రయించాలో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధాన్యం అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లావ్యాప్తంగా ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో ధాన్యం కొనాలంటూ రైతులు ఆందోళనలు చేస్తున్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు..

జిల్లా వ్యాప్తంగా రబీలో 58,586 హెక్టార్లలో వరి సాగైంది. 5.11 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 60 వేల మెట్రిక్ టన్నులు ఫైన్ వెరైటీ. మిగిలిన 4.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ, ఇందులో 2.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు 216 కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రక్రియ ప్రారంభించారు. ఏప్రిల్ 22వ తేదీ నాటికే 2,63,076 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, లక్ష్యాన్ని అధిగమించినట్లు అధికారులు చెప్పారు. పండించిన ప్రతి గింజా కొంటామంటూ ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం టార్గెట్ పూర్తయిందంటూ కొనుగోళ్లు నిలిపివేసింది.

దీంతో, మిగిలిపోయిన ధాన్యాన్ని ఎక్కడికక్కడే పెట్టుకుని రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనికితోడు అకాల వర్షాలు కురవడంతో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానాపాట్లూ పడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన రైతులు తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగడంతో సర్కారు దిగివచ్చింది. మరో లక్ష టన్నుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా మొత్తం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇచ్చింది. ఈ నెల 24వ తేదీ నాటికే 3.39 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. దీనికి గానూ మొత్తం రూ.781.08 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.632.6 కోట్లు చెల్లించింది. తొలి లక్ష్యం మేరకు ఏప్రిల్ 22వ తేదీ నాటికే సేకరించిన 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. అదనంగా కొన్న లక్ష మెట్రిక్ టన్నులకు సంబంధించి రూ.148.48 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు మంజూరు చేస్తారా అని నిరీక్షిస్తున్నారు.

మిగిలిన ధాన్యం ఏం చేయాలి?

రైతుల వద్ద కొనుగోలు చేసిన 3.39 లక్షల మెట్రిక్ టన్నులు పోనూ, ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంకా 11 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించాల్సి ఉంది. దీని ప్రకారం, రైతుల వద్ద ఇంకా 1.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిగిలిపోతోందని అంచనా. ఈ ధాన్యాన్ని కళ్లాలు, కుప్పలు, పొలాలు, రహదారులపై రైతులు నిల్వ ఉంచారు. ఈవిధంగా మిగిలిపోయిన ధాన్యం ఎవరు కొంటారు.. ఎక్కడ విక్రయించాలో అర్థం కాక రైతులకు కంటి మీద కునుకు కరువవుతోంది. సరిగ్గా ఇదే సమయంలో తరచుగా కురుస్తున్న వర్షాలు వారిని ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే పెరవలి, నిడదవోలు, ఉండ్రాజవరం తదితర ప్రాంతాల్లో ఇటీవలి వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వం ఎప్పుడు కొంటుందో



ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం ఎప్పుడు కొంటుందో అర్థం కావడం లేదు. వాతావరణ పరిస్థితులు చూస్తుంటే భయం వేస్తోంది. కళ్లాల్లో ఎన్ని రోజులని ధాన్యం భద్రంగా ఉంచుకోగలం? ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలి. లేకపోతే మాకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

– పంతం పోలేశ్వరరావు,
రైతు, ఖండవల్లి, పెరవలి మండలం

ఇంజినీరు పోస్టులు ఖాళీగా ఉండడం ఆందోళనకరం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ : ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ పంపిణీ సంస్థలతో సహ ట్రాన్స్‌కో, జెన్ కోతో కలుపుకుని క్షేత్రస్థాయిలో వెయ్యికి పైగా ఏఈల పోస్టులు ఖాళీగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని ఏపీఎస్‌ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కపల్లి శ్యామ్యూల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకి విద్యుత్ వినియోగం పెరుగుతున్న తరుణంలో అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉండడం లేదన్నారు. కీలకమైన ఏఈ స్థాయి అధికారుల యామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. 2022 పే రివిజన్ కారణంగా 1,800 మంది ఇంజినీర్లు ఇంక్రిమెంట్లు కోల్పోయారని సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని సమావేశం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నాగప్రసాద్, అసోసియేట్ సెక్రటరీ కె.వి.రామారావు, బ్రాంచి సెక్రటరీ రత్నాలరావు పాల్గొన్నారు.

థియేటర్ల బంద్ నిర్ణయం జరగలేదు

తూర్పుగోదావరి జిల్లా ఎగ్జిబిటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కోళ్ల బాబు



విలేకరులతో మాట్లాడుతున్న కోళ్ల బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జూన్ 1నుంచి సినిమా థియేటర్ల బంద్ నిర్ణయం జరగలేదని తూర్పుగోదావరి జిల్లా ఎగ్జిబిటర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కోళ్ల అచ్యుత రామారావు(బాబు) స్పష్టం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సినిమా థియేటర్ల మనుగడ కోసం దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్చించుకోవడానికి తూర్పు గోదావరి జిల్లా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు సమావేశం నిర్వహించామన్నారు. జనవరి, ఏప్రిల్ నెలల్లో రెండుసార్లు తమ సంఘం ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయని, థియేటర్ల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. హైదరాబాద్‌లో మే 13న సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో నైజాంలో అమల్లో ఉన్న పర్సంటేజీల విధానం ఆంధ్రాలోను అమలు చేయాలనే వాదన వచ్చిందన్నారు. ఈ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు జూన్ ఒకటి నుంచి ఎవరికి వారు థియేటర్లను సొంత నిర్ణయంపై నడుపుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ ప్రకటన రావడంతో నైజాంకు చెందిన కొందరు పెద్దలు సినిమా రిలీజ్‌ను అడ్డుకోవాలని కుట్ర చేయడం వాస్తవమన్నారు. అయితే ఆ నెపాన్ని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎగ్జిబిటర్ అత్తి సత్యనారాయణపై నెట్టివేశారని ఆరోపించారు. సినిమా హాల్స్ నిర్వహించడం ఆర్థికంగా నష్టదాయకమని, నిర్మాతలు పర్సంటేజీలు ఇస్తేనే ప్రదర్శనలు జరుగుతాయన్నారు. సమస్య పరిష్కారానికి సినీ నిర్మాత మండలి, నటీనటుల సంఘం (మా), ప్రభుత్వం సమష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

హీరోలు ఏడాదికి రెండు సినిమాలు చేస్తే థియేటర్లకు మనుగడ

హీరోలు ఏడాదికి రెండు, మూడు సినిమాలు చేస్తేనే థియేటర్లకు మనుగడ ఉంటుందన్నారు. ఒక్కో హీరో సినిమా రెండేళ్లకు పైగా పడుతోందని దీని వల్ల సినిమాలు లేక థియేటర్‌లో కొన్ని షోలు నిలుపుకోవాల్సి వస్తోందన్నారు. థియేటర్లలో అధికారుల తనిఖీలు సర్వ సాధారణమన్నారు. సినిమాలకు ప్రేక్షకులే రానప్పుడు తినుబండారాల అమ్మకాలు ఏం జరుగుతాయన్నారు. భారీ బడ్జెట్ సినిమాలు రిలీజ్ అయ్యినప్పుడు టిక్కెట్ ధరలు పెంచడం వల్ల సినిమాకు వచ్చే ప్రేక్షకులతో తిట్లు తినాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధిక ధరలు వల్ల నేల టిక్కెట్లు అమ్ముడు పోవడం లేదన్నారు. థియేటర్ల వ్యవహారంపై ఈనెల 30విశాఖలో ఏపీ ఫిల్మ్ చాంబర్, డిస్ట్రిబ్యూటర్ల సంయుక్త సమావేశం జరుగుతుందన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు ఎం.సదాశివ, డి.శ్రీనివాస్, సభ్యులు జి.రామారావు, జాస్తి బాపయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన

వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు ధ్వజం



చాగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

చాగల్లు: రాష్ట్రంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దళితులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజమెత్తారు. బుధవారం చాగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెనాలిలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై పోలీసులు మానవ హక్కులను ఉల్లంఘిస్తూ నడిరోడ్డుపైనే థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని ఆయన ఖండించారు. దళితులపై పోలీసుల అరాచకాలు కొనసాగుతున్నాయని, చట్టాలను కాపాడాల్సిన పోలీసులే వాటిని కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్టొద్దని దళిత, మైనార్టీ యువకులు వేడుకుంటున్నా పోలీసులు నడిరోడ్డుపై లాఠీలతో చితకబాదటం దారుణమన్నారు. రాష్ట్రంలో దళితులు, మైనారిటీలు, బడుగులకు ఆత్మగౌరవంతో బతికే హక్కు లేదా? వారిని పశువులను కొట్టినట్లు నడిరోడ్డుపై కొట్టే హక్కు పోలీసులకు ఏ రాజ్యాంగం ఇచ్చింది?' అని వెంకట్రావు ప్రశ్నించారు. 'రెడ్ బుక్ రాజ్యాంగంలో దళితులు, మైనారిటీలను ఇలాగే హింసించాలని ఉందా అని ప్రశ్నించారు. ఇంతటి అమానవీయ ఘటన జరిగితే కనీసం దళిత హోంమంత్రి కూడా. స్పందించరా? యువకులను కొడుతుండగా వీడియోలు తీసి పోలీసులు ఎవరికి పంపారు? దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. ఈ ఘటనను చూసి దళితులు, మైనారిటీలు అభద్రతాభావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడన్న కారణంతో..

స్థానిక సమస్యలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడన్న కారణంతో రాజమహేంద్రవరానికి చెందిన అనే దళిత యువకుడిని పోలీసులు స్టేషన్‌కి పిలిపించి కొట్టి బెదిరించారని, అర్ధనగ్నంగా లాకప్‌లో నిలబెట్టి మహిళా కానిస్టేబుల్‌ను కాపలాగా ఉంచి మానసికంగా వేధించారని వెంకట్రావు గుర్తు చేశారు. గుంటూరు జిల్లా కంతేరులో కల్పన అనే దళిత ఎంపీటీసీ సభ్యురాలికి చీర మార్చుకునే అవకాశం కూడా ఇవ్వకుండా అర్ధరాత్రి 20 మంది పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి లాక్కెళ్లారని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిందన్న కారణంగా పాలేటి కృష్ణవేణి అనే మహిళను హైదరాబాద్‌లో ఉంటే అరెస్ట్ చేసి తీసుకొచ్చారని, ఆమెను కలిసే అవకాశం ఇవ్వకుండా పోలీస్ స్టేషన్‌కే బేడీలు వేశారని వివరించారు.

కన్నీటి గోదావరి

- ప్రమాదకరంగా నదీ తీరం
- అడుగడుగునా అగాధాలు, గోతులు
- స్నానానికి దిగి పలువురు మృతి
- ప్రాణాలు తీస్తున్న ఈత సరదా
- చనిపోతున్న వారిలో యువకులే అధికం
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

సాక్షి, అమలాపురం: ఉప్పొంగుతూ, ఉరకలేస్తూ, పరవళ్లు తొక్కే గోదావరిని చూస్తే మనసు పులకరించకుండా ఉండదు. ఆ గోదావరిలో స్నానం చేస్తే ఆ ఆనందమే వేరు. అందులోనూ వేసవి ఎండలు మండే సమయంలో చల్లని గోదారి నీటిలో జలకలాడాలని ప్రతి ఒక్కరి మనసు ఉవ్విళ్లూరుతుంది. చిన్నారులు, యువకులు, నడి వయసువారు గోదావరిని చూడగానే చెంగున దూకి ఈత కొడుతుంటారు. అయితే కొన్నిసార్లు ఆ సరదా చెంతనే పొంచి ఉంటుంది. దీన్ని గమనించని అనేక ప్రాణాలు గోదావరిలో కలిసిపోతున్నాయి.

వరస ఘటనలు

జిల్లా పరిధిలోని ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ శివారు సలాదివారిపాలెం వద్ద గౌతమి గోదావరి నదీపాయలో సోమవారం స్నానానికి దిగి ఎనిమిది మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అలాగే మంగళవారం సాయంత్రం పి.గన్నవరం మండలం నాగులంక శివారు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే ఆచంట వద్ద మునిగి ముగ్గురు చనిపోయారు. వీరంతా కూడా 20 ఏళ్ల లోపు వయసు వారే. కేవలం రెండు రోజుల వ్యవధిలో జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాదకర పరిణామాలు స్థానికులను, జిల్లా వాసులను మనస్తాపానికి గురి చేశాయి. తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చాయి.

అనేక గోతులు

గోదావరిలో ఈత అంత సులువు కాదు. అందులోనూ పర్యవేక్షణ లేని ప్రాంతాల్లో మరింత ప్రమాదకరం. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ దిగువ నుంచి సముద్రంలో కలిసే ప్రాంతం వరకూ వెళ్లే గోదావరి పాయల్లో మలుపులు, సుడులు, పెద్ద గోతులు, అగాధాలు ఉంటాయి. పైకి ఇసుక తెన్నెలు ఆహ్లాదంగా కనిపిస్తుంటాయి. కానీ వాటి చెంతనే ప్రమాదానికి గురి చేసే పెద్ద గోతులు కూడా ఉంటాయి.

పొంచి ఉన్న ప్రమాదం

గోదావరిలో సహజ సిద్ధమైన ఊట బావులు (స్విక్కర్లు) ఉంటాయి. ధవళేశ్వరం బ్యారేజీ దిగున వీటితో పాటు ఊబితో కూడిన గోతులు (దొంగ ఊబి) కూడా ఉన్నాయి. ఇవి అత్యంత ప్రమాదకరం. ఇసుక మేటల మధ్య ఉండే ఇవి పైకి కనిపించవు. పైగా వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. రెండు, మూడు అడుగుల ఎత్తున నీరు ఉండే ఇసుక తెన్నెల మధ్య నుంచి నడిచి వెళుతున్న సమయంలో అమాంతంగా ఊబిలో కూరుకుపోయి పలువురు యువకులు మృత్యువాత పడ్డారు. నిత్యం గోదావరితో సావాసం చేసే ఇరిగేషన్ అధికారులు, స్థానిక మత్స్యకారులకు సైతం వీటిని గుర్తించడం సాధ్యం కాదు.



గోదావరి మధ్యలో ఆకర్షణీయంగా కనిపించే ఇసుక తిన్నెలు. వీటి మధ్యలో అగాధాలెన్నో..

ఇసుక అక్రమ తవ్వకాలతో ముప్పు

గోదావరి పాయల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యువకుల పాలిట ముప్పుగా మారాయి. ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రాంతాల్లోని రాంపుల్లోనే కాకుండా గోదావరి పొడవునా పెద్ద ఎత్తున అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుకాసురులు చెలరేగి పోతున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, అయినవిల్లి, ఐ.పోలవరం, ముమ్మిడివరం ప్రాంతాలలో ఈ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

ఆటుపోట్ల ప్రభావం

నది కలిసే ప్రాంతాల్లో సముద్ర ఆటుపోట్ల ప్రభావం కూడా ఉంటోంది. పుదుచ్చేరి యానాం, ఐ.పోలవరం, కె.గంగవరం, తాళ్లరేవు, ముమ్మిడివరం, సఖినేటిపల్లి, రాజోలు, మలికిపురం, మామిడికుదురు మండలాల్లోని గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయి నదీపాయలలో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్ర సమయాల్లో నదిలోని నీరు ఉధృతి తగ్గడం, పెరగడం జరుగుతుంది. పాటు సమయంలో నీరు తక్కువగా ఉందని దిగుతున్న యువకులు పోటు సమయంలో పెరుగుతున్న నీటిని అంచనా వేయలేకపోతున్నారు. సలాదివారిపాలెం వద్ద సోమవారం జరిగిన ప్రమాదానికి ఇదే కారణమైంది. నీరు తక్కువగా ఉండటం వల్ల ఇసుక దిబ్బలు పైకి లేచాయి. దీనితో యువకులు నదిలో కొంత దూరం నడిచి వెళ్లి స్నానానికి దిగారు. అక్కడ పెద్ద గోతులు ఉండటంతో ఒకరి తర్వాత ఒకరు మునిగిపోవడం జరిగింది.

స్పందన ఏదీ!

యువకులు, చిన్న పిల్లలు గోదావరి పాయలలో స్నానాలకు వెళ్లి మృత్యువాత పడుతున్నా జిల్లా యంత్రాంగంలో స్పందన లేకుండా పోయింది. ముఖ్యంగా సాగునీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీసులు, స్థానిక గ్రామపంచాయతీ అధికారులు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. వీరందరూ సమన్వయంతో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగినప్పుడు హడావుడి చేయడం తప్ప తర్వాత వీటిని పట్టించుకునే వారే లేకుండా పోతున్నారు. కనీస హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే చాలా వరకు ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. స్థానికంగా ఉండే మత్స్యకారులను, గజ ఈతగాళ్లను గుర్తించి ప్రమాదం జరిగిన వెంటనే వారి సేవలను వినియోగించుకుంటే కొంతమందినైనా రక్షించుకునే అవకాశం ఉంటుంది.

నదిలో అగాధాలు



గోదావరిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు

ఏటిగట్లను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోనే కాకుండా పడవల మీద నది మధ్యలో, ఇతర ప్రాంతాలకు వెళ్లి తవ్వకాలు చేస్తున్నారు. కొందరు పడవలపై డ్రెడ్జర్లు ఏర్పాటు చేసి మరీ ఇసుకను తోడిపోస్తున్నారు. దీనివల్ల నదీ గర్భంలో అగాధాలు ఏర్పడుతున్నాయి. ఇసుక తవ్వకాల వల్ల గోతులు పడటం, అవి పూడుకునేందుకు మిగిలిన ప్రాంతాల్లోనే ఇసుక సర్దుకోవడం వల్ల మెరక ప్రాంతాలు సైతం లోతుగా మారుతున్నాయి. అలాగే గోదావరి సహజ ప్రభావం వల్ల లంక గ్రామాలలో మెరక భూములు కొట్టుకుపోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలోనే గోదావరిలో కొత్తగా లోతైన అగాధాలు ఏర్పడుతున్నాయి.

క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫలితాల విడుదల



డిగ్రీ ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెకండ్, ఫైనల్ ఇయర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు బుధవారం విడుదల చేశారు. ఫైనల్ ఇయర్ (ఆరో సెమిస్టర్) ఫలితాలకు సంబంధించి బీఏ 91.30 శాతం, బీకాం 94.03 శాతం, బీబీఏ 97.92 శాతం, బీఎస్సీ 87.50 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ (నాలుగో సెమిస్టర్) ఫలితాలలో బీఏ 74.1 శాతం, బీకాం 81.36 శాతం, బీబీఏ 81.65 శాతం, బీఎస్సీలో 80.44 శాతం ఉత్తీర్ణులయ్యారు.

ఎస్సీ యువతకు ఉపాధి శిక్షణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు లీడ్ క్యాప్, సీడాప్ ద్వారా లెదర్ ఫుట్ వేర్ తయారీ కోర్సులో 60 రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. దీని కోసం ఆసక్తి కలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారితో పాటు ఫెయిలైనవారు కూడా శిక్షణకు అర్హులే. వయోపరిమితి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉండాలి. గుంటూరులోని నల్లపాడులో ఉన్న శ్రీకృష్ణసాయి ఎడ్యుకేషన్ సొసైటీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఆ సమయంలో ఉచితంగా భోజనం, వసతితో కూడిన సదుపాయాలు కల్పిస్తారు. మరిన్ని వివరాలకు 90309 24569, 79813 49691 నంబర్లను సంప్రదించాలి.

వ్యక్తిని రక్షించి.. యువకుడి మృతి



ఇషాక్ మదీనావలీ మృతదేహం

ఎస్.రాయవరం (అనకాపల్లి): రేవు పోలవరం తీరంలో సముద్రంలో మునిగిపోతున్న వ్యక్తిని కాపాడబోయే ప్రయత్నంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై విభీషణరావు తెలిపిన వివరాల ప్రకారం.. తుని మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన షేక్ ఇషాక్ మదీనా వలీ (20), షేక్ అలీషాలు అదే గ్రామానికి చెందిన షేక్ అహ్మదుల్లా ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్ కోసం బుధవారం అనకాపల్లి జిల్లా రేవు పోలవరం తీరానికి వచ్చారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సముద్రంలోకి కొట్టుకు పోతున్నట్టు గమనించారు. ఒడ్డున ఉన్న మహిళ బిగ్గరగా అరవడంతో విన్న ఇషాక్ మదీనా వలీ, అలీషాలు సముద్రంలోకి వెళ్లి ఆ వ్యక్తిని రక్షించారు. ఇంతలో రాకాసి అలలు పోటెత్తడంతో ఇషాక్ మదీనావలీ కొట్టుకుపోయాడు. వెంటనే స్థానిక మత్స్యకారులు బయటకు తీసినప్పటికీ ప్రాణాలు నిలువలేదు. అతడి మృతదేహాన్ని నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రుచి మధురం.. రైతుకు లాభం



కవర్ కల్చర్ విధానంలో సాగుచేసిన పండ్లు



తూర్పుపాలెంలోని మామిడి తోటల్లో అమలవుతున్న కవర్ కల్చర్ విధానం



ఆకర్షణీయంగా కవర్ కల్చర్ బంగినపల్లి మామిడి

- మామిడి సాగులో కవర్ కల్చర్
- ఆశాజనకంగా దిగుబడి
- చీడపీడల నుంచి రక్షణ
- బంగినపల్లి రకానికి ఎంతో అనుకూలం

మలికిపురం: మామిడి తోటల నుంచి అధిక దిగుబడి సాధించడానికి రైతులు అనేక చర్యలు చేపడతారు. కాయలు రాలిపోకుండా, బాగా పెరిగేలా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రస్తుతం మామిడి సాగులో కవర్ కల్చర్ ఎక్కువగా కనిపిస్తోంది. గత మూడేళ్లుగా ఈ విధానంలో అమల్లో ఉన్నప్పటికీ ఇటీవల బాగా వెలుగులోకి వచ్చింది. తోటల నుంచి దిగుబడి మెరుగ్గా ఉండడంతో రైతులందరూ ఈ విధానం ఆచరిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ఈ కవర్ కల్చర్ విధానం ఉన్నప్పటికీ మామిడిలో మేలు జాతి అయిన బంగినపల్లి సాగులో ఎంతో మేలు చేస్తోంది. సాధారణంగా రైతులు, లీజుదారులు కూడా బంగినపల్లి మామిడిపై అధికంగా పెట్టుబడితో పాటు లాభాలపై ఆశలు పెట్టుకుంటారు. అయితే ఈ రకంపై చీడ పీడల కారణంగా నష్టపోతున్నారు.బంగినపల్లి మామిడి పండ్లకు మలికిపురం మండలంలోని గూడపల్లి ఎంతో ప్రసిద్ధి చెందింది. గూడపల్లి కేంద్రంగా రాజోలు దీవిలో పలు గ్రామాలలో సాగవుతున్న బంగినపల్లి మామిడికి రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలో ఇక్కడ సాగయ్యే బంగినపల్లి మామిడిపై రైతులు, వ్యాపారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

మంచి ధర

కవర్ కల్చర్ విధానంలో సాగు చేసిన మామిడి కాయలకు ధర ఎక్కువగానే లభిస్తుంది. సాధారణ విధానంలో సాగైన బంగినపల్లి మామిడికి సంబంధించి నూజివీడు మార్కెట్‌లో మంగు కాయ కేజీ రూ.15 నుంచి రూ.20 వరకూ ఉంటుంది. మేలైన కాయ కేజీ రూ.40 వరకూ పలుకుతుంది. అయితే గూడపల్లిలో బంగిన పల్లి కాయ ధర రూ.70 వరకూ ఉంటుంది. కవర్ కల్చర్‌లో పెరిగిన మామిడి కాయ గూడపల్లిలో ఏకంగా కేజీ రూ.130 నుంచి 160 వరకూ ధర పలుకుతోంది. వీటిని కూడా నేరుగా తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేసుకుంటున్నారు. ఫోన్‌లో ఆర్డర్లు చేసి ట్రాన్స్‌పోర్టు చేయించుకుంటున్నారు. సాధారణంగా బంగినపల్లి మామిడికి రుచి ఎక్కువ. రాజోలు దీవిలోని గూడపల్లి బంగినపల్లికి మరింత రుచి ఉంటుంది.

పాడి-పంట

దిగుబడి బాగుంది



కవర్ కల్చర్ విధానంలో మూడేళ్లుగా బంగినపల్లి మామిడిని సాగు చేస్తున్నాను. కృష్ణా జిల్లాతో పాటు రాజోలు దీవిలోని గూడపల్లి పరిసర ప్రాంతాలలో ఈ పద్ధతి పాటిస్తున్నారు. దీనివల్ల దిగుబడి చాలా బాగుంది. ఎక్కువ ఆదాయం వస్తోంది.

– గట్టిం సూరిబాబు, రైతు, తూర్పుపాలెం

ఎర్రని నేలలు

రాజోలు దీవిలోని పలు గ్రామాలలో ఎర్రని ఇసుక నేలల ఉండడం వల్ల ఇక్కడ బంగిన పల్లికి రుచి ఎక్కువగా ఉంటుందని పూర్వీకులు చెబుతున్నారు. దీంతో ఇక్కడి కాయలకు ధర కూడా ఎక్కువే. వాతావరణ మార్పుల రీత్యా రాజోలు దీవిలో మామిడి చెట్లు ఆలస్యంగా కాపునకు వస్తాయి. ఏప్రిల్‌లో పూత పూస్తాయి. సీజన్ చివర జూన్‌లో దిగుబడి వస్తాయి. కానీ వర్షాలు మొదలు కావడంతో గూడపల్లి కాయలు మే చివరి నాటికే పక్వానికి చేరుకున్నాయి. జోరుగా ఎగుమతులు సాగుతున్నాయి. రాజోలు దీవి నుంచి ప్రతి ఏడాది సుమారు పది వేల టన్నుల బంగినపల్లి రకం బయట ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది.

సాగు ఇలా..

- సాధారణంగా ఫిబ్రవరిలో పూతకు వచ్చే మామిడికి అంతకు ముందు డిసెంబర్, జనవరి నెలల్లో చీడపీడలు దరి చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మార్చి నెలాఖరుకు, ఏప్రిల్‌లో పిందె దశకు చేరుకుంటుంది.
- పిందె వంద గ్రాములు అయ్యాక ప్రత్యేకమైన కవర్‌ను ఆ పిందెకు కడతారు. ఇక పండు తయారయ్యే వరకూ దాన్ని తీయరు. దీనివల్ల ఆ మామిడిని ఏ విధమైన చీడపీడలు ఆశించవు.
- కవర్ వేయడం వల్ల ఈదురుగాలులకు కాయ రాలిపోదు. ఒకవేళ రాలిపోయినా కాయ పాడవదు. నిర్ణీత సమయానికి పక్వానికి వచ్చిన కాయలను కోసి ఎగుమతి చేసుకోవచ్చు.
- ఇవి సాధారణ కాయల కంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. పురుగు పట్టకుండా నాణ్యతగా ఉంటాయి. దిగుబడి కూడా రెట్టింపు ఉంటుందని రైతులు చెబుతున్నారు.
- మామూలుగా చీడపీడల వల్ల సగానికి పైగా కాయలు.. పిందె దశలోనే రాలి పోతాయి. అయితే కవర్ కల్చర్ వల్ల పురుగు చేరకుండా మామిడి పెరుగుతుంది. నష్టం పెద్దగా ఉండదు. కేవలం ఒక్కొక్క కవర్‌కు రూ.2.50 మాత్రమే ఖర్చవుతుంది. వీటిని కాయకు కట్టేందుకు మరో రూ.2.50 అవుతుంది.

దైవదర్శనానికి వచ్చి అనంత లోకాలకు..

- స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడి మృతి
- అన్నవరంలోని పంపా స్నానఘట్టాల వద్ద ప్రమాదం



చరణ్ తేజ్ మృతదేహం



ప్రమాదం జరిగిన ప్రదేశం

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంతో ఒక యువకుడి ప్రాణం పోయింది. పంపా రిజర్వాయర్‌లో స్నానఘట్టాల వద్ద స్నానం చేసేందుకు దిగిన ఆ యువకుడు శ్రీచక్రస్నానం కోసం తీసిన గోతిలో జారిపడి మృతి చెందాడు. అన్నవరం ఎస్సై శ్రీహరి బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం జగపతి నగరానికి చెందిన 15 మంది భక్తులు బుధవారం సత్యదేవుని దర్శనానికి వచ్చారు. స్నానాలు చేసేందుకు పవర్ ఆఫీసు వద్ద గల పంపా స్నానఘట్టాల వద్దకు వచ్చారు. వీరిలో ముగ్గురు యువకులు నదిలోకి దిగి నడుచుకుంటూ ముందుకు వెళ్లారు. మొదట మూడు అడుగుల లోతు మాత్రమే ఉండడంతో ఇంకా ముందుకు వెళ్లగా సత్యదేవుని చక్రస్నానం కోసం తీసిన గోతిలో జారి మునిగిపోయారు. వారి కేకలు విన్న సమీపంలోని వారు వెంటనే అక్కడకు వెళ్లి ఇద్దరిని ఒడ్డుకు లాగేశారు. వాసంశెట్టి చరణ్ తేజ్ (16) మాత్రం లోపలకు వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. కొంతసేపటికి చరణ్ తేజ్ పైకి తేలడంతో ఒడ్డుకు తీసుకువచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా.. చరణ్ తేజ్ ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో కిర్లంపూడి మండలంలోనే మొదటి స్థానం పొందినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

నిర్లక్ష్యంగా వదిలేశారు

పంపా నదిలో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో సత్యదేవుని ఉత్సవాల కోసం నాలుగేళ్ల క్రితం పంపా స్నానఘట్టాలకు సమీపంలో కోనేరు మాదిరిగా ఆరు అడుగుల లోతు గొయ్యి తవ్వారు. ఏటా వేసవిలో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ఆ గోతిని మరింత లోతుగా చేసి, దానిలో నీరు నింపి శ్రీరామనవమి వేడుకలు, సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలలో చక్రస్నానం నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన కూడా ఆ గోతిలోనే సత్యదేవుని చక్రస్నానం నిర్వహించారు. ఆ కార్యక్రమం అయ్యాక ఆ గోతి చుట్టూ మెస్‌తో ఫెన్సింగ్ చేయడమో లేక ఆ గోతి చుట్టూ సుమారు పది అడుగుల ఎత్తు కలిగిన కర్రలు పాతి జెండాలు అమర్చితే అందరికీ తెలిసేది. ఇటీవల వర్షాలకు పంపాలోకి నీరు చేరి, నీటిమట్టం 88 అడుగులకు వచ్చేసింది. దీంతో ఆ గొయ్యి నీటితో నిండిపోయింది. ఒడ్డు నుంచి చూసే వారికి అక్కడ గొయ్యి ఉందనే సంగతే తెలియదు. చరణ్ తేజ్‌తో పాటు మరో ఇద్దరు కూడా అలాగే ఆ గోతిలో పడిపోయారు.

లాటరైట్ లారీలకు జరిమానా



లారీలను తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

ప్రత్తిపాడు: వంతాడ క్వారీ నుంచి లాటరైట్ ఖనిజాన్ని తరలిస్తూ నిబంధనలు పాటించని తొమ్మిది లారీలపై బుధవారం ట్రాన్స్‌పోర్టు అధికారులు కేసులు నమోదు చేశారు. జిల్లా డీటీసీ శ్రీధర్ ఆదేశాల మేరకు శంఖవరం మండలం కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ ప్రత్తిపాడు – లంపకలోవ రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. వంతాడ క్వారీ నుంచి లాటరైట్ ఖనిజాన్ని రావికంపాడుకు తరలిస్తున్న వాహనాలను పరిశీలించగా, లాటరైట్ ఖనిజం లోడుపై కవరు కప్పి ఉంచకపోవడం, మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, డ్రైవర్ల వద్ద డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం తదితర కారణాలపై తొమ్మిది వాహనాలపై కేసులు నమోదు చేశారు. వీటికి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ రూ.58 వేల జరిమానా విధించారు.

రూ.12 లక్షలతో అక్కౌంటెంట్ పరారు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన వ్యాపారి గంగుమళ్ల కాసుబాబు వద్ద ఐదేళ్లుగా అక్కౌంటెంట్‌గా పనిచేస్తున్న కంతేటి రాజా రూ.12 లక్షలతో ఉడాయించాడు. దీనిపై కాసుబాబు ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన రాజా.. వ్యాపారి కాసుబాబు వద్ద అక్కౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న రాజాకు వ్యాపారి కాసుబాబు ముమ్మిడివరం సీఎస్‌బీ బ్యాంకులో తాకట్టు పెట్టిన దాదాపు రూ.10 లక్షల విలువైన బంగారు నగలు విడిపించాలని, దానికి రూ.2.25 లక్షలు నగదు ఇచ్చి పంపించారు. అయితే రాజా ఆ బ్యాంకులో బంగారు నగలను తీసుకుని నగదుతో పరారయ్యాడు. అప్పటి నుంచి అతడి ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

లారీ డ్రైవర్‌పై కేసు

చాగల్లు: నిడదవోలు – పంగిడి రహదారిలో అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడిపి నాలుగు గేదెలు చనిపోవడానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. మీనానగరం గ్రామ శివారులోని ఐఎంఎల్ డిపో వద్ద నిడదవోలు నుంచి పంగిడి వైపు వెళుతున్న క్వారీ లారీ మంగళవారం రాత్రి గేదెలను ఢీకొంది. ఈ ఘటనలో నాలుగు గేదెలు అక్కడికక్కడే చనిపోయాయి. వాటి యజమాని మంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకుని రైతు మృతి



వెంకన్నబాబు (ఫైల్)

నల్లజర్ల: చీపురుగూడెం రిజర్వు ఫారెస్ట్‌లో చెట్టుకు ఉరి వేసుకుని రైతు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మన్నపాలెం గ్రామానికి చెందిన రైతు మానికల వెంకన్నబాబు (35) గత నెల 7వ తేదీన పశువులను మేపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లాడు. కానీ తిరిగి రాకపోవడంతో 8వ తేదీన ఆయన భార్య దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. అదే గ్రామానికి చెందిన దానయ్య ఈ నెల 27న మేకలు మేపడానికి అటవీ ప్రాంతానికి వెళ్లగా ఒక చోట వెంకన్నబాబుకు చెందిన సైకిల్, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. ఈ విషయాన్ని వెంటనే వెంకన్నబాబు తండ్రి సత్యనారాయణకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించగా ఒక చెట్టుకు ఎముకల గూడు వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల సాయంతో అది వెంకన్నబాబుదేనని గుర్తించారు. ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..



వెంకటపతి (ముసలయ్య) (ఫైల్)

అంబాజీపేట: దైవ దర్శనాలకు వెళ్లి తిరిగి వస్తుండగా కారును లారీ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇవీ.. అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామానికి చెందిన మామిడిశెట్టి వెంకటపతి (ముసలయ్య) (58), భార్య కనకదుర్గ (54), వీరి కుమారుడు వెంకటరత్నం (32), కోడలు జ్యోతి స్వరూప, మనుమలు 12 ఏళ్ల దీక్షిత, 2 ఏళ్ల చేతన్ ఈ నెల 19వ తేదీ రాత్రి కాళేశ్వరం పుష్కరాలకు కారులో వెళ్లారు. అనంతరం ఈ నెల 20న భద్రాచలంలో దైవ దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి తిరిగివస్తుండగా ఈనెల 21వ తేదీన కొత్తగూడెం వద్ద బొగ్గు టిప్పర్ వీరు ప్రయాణిస్తున్న కారును బలంగా ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కనకదుర్గ, వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందారు. ముసలయ్య విజయవాడ మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. జ్యోతి స్వరూప, దీక్షిత, చేతన్ చికిత్స పొందుతున్నారు.

విద్యుత్ షాక్‌తో..



పదిలం శ్రీను (ఫైల్)

నల్లజర్ల: అనంతపల్లి శివారు కృష్ణమ్మగూడేనికి చెందిన పదిలం శ్రీను (42) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పదిలం శ్రీను వ్యవసాయ కూలీ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం పొలం పనికి వెళ్లి వచ్చాడు. తన పశువులను మేత కోసం ఉండాళ్ల చెరువు సమీపానికి తోలుకు వెళ్లాడు. అక్కడ నీరు లేకపోవడంతో దగ్గరలోని బోరు వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. అతడికి భార్య మహేంద్ర, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఒమెన్‌లో అల్లవరం వాసి..



రాజేంద్ర ప్రసాద్ (ఫైల్)

అల్లవరం: మండలంలోని వీరన్న మెరక ప్రాంతానికి చెందిన బద్దె రాజేంద్ర ప్రసాద్ (41) ఒమెన్‌లో వారం రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. ఒమెన్ దేశంలో పదేళ్లుగా డ్రైవర్‌గా రాజేంద్ర ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి, తిరిగి ఆ దేశానికి వెళ్లిపోయాడు. అక్కడ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూనే జై భీమ్ ఇంటర్నేషనల్ యూట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నాడు. కాగా.. రాజేంద్ర ప్రసాద్ చనిపోయాడన్న సమాచారం తెలియడంతో, దాన్ని నిర్ధారణ చేసుకోవడం కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను అతడి భార్య సుధ ఆశ్రయించారు. కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులు ఏపీ ఎన్నార్టీ ద్వారా భారత రాయబారి కార్యాలయాన్ని సంప్రదించారు. అక్కడ వారు విచారణ చేయగా, మే 20న ఒమెన్‌లోని సూర్ పట్టణంలో రాజేంద్ర ప్రసాద్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని వివరణ ఇచ్చారు. ఆయన మృతదేహాన్ని భారత్‌కు తరలించడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు సహకారం తీసుకున్నారు.

జల్సాలకు బానిసలై చోరీల బాట

- ఇద్దరు యువతులు, యువకుడి అరెస్టు
- బంగారం, వెండి వస్తువుల స్వాధీనం

కడియం: వేమగిరి దేవీజనార్దన్ నగర్‌లో మే 26వ తేదీ జరిగిన చోరీ ఘటనకు సంబంధించి ముగ్గురిని కడియం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పలు వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దేవీజనార్దన్ నగర్‌లో ఒంటరిగా ఉంటున్న దుళ్ళ అనంతలక్ష్మి అనే మహిళ ఇంట్లోకి ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం ఒక యువకుడు, ఇద్దరు యువతులు ప్రవేశించారు. ఆమెను కొట్టి మెడలోని 12 గ్రాముల బంగారు గొలుసు, బీరువాలోని వెండి పూజా సామగ్రి, రూ.5 వేలు దోచుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై పట్టా ధనలక్ష్మి ప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్సైలు పట్టా ధనలక్ష్మి ప్రసన్న, బి.దుర్గాప్రసాద్, క్రైం కానిస్టేబుల్ కె.సురేష్ బాబు, జి.రవికుమార్ ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తును ముమ్మరం చేశారు.

అనుమానాస్పదంగా..

ఇదిలా ఉండగా వాహనాల తనిఖీల్లో భాగంగా కడియం రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన పెరవలి రామ్‌కుమార్, కాకినాడ జిల్లా కొవ్వాడ గ్రామానికి చెందిన భయ్యి ఉష, కాకినాడ జిల్లా పెద్దాపురం మండలానికి చెందిన కాట ఇందిరా ప్రియదర్శినిలను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. దీంతో వేమగిరిలో చోరీ విషయం వెలుగుచూసింది. వారి నుంచి 216 గ్రాముల వెండి వస్తువులు, 11.40 గ్రాముల బంగారు గొలుసు, రూ.3 వేలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోరీకి ఉపయోగించిన బ్లాక్ కలర్ మోటారు సైకిల్‌ను కూడా సీజ్ చేశారు. జల్సాలకు అలవాటు పడిన వీరు ముగ్గురూ బృందంగా ఏర్పడి నేరానికి పాల్పడుతున్నారు. వేమగిరిలో మొట్టమొదటి చోరీ చేశారని, వేగంగా దర్యాప్తు చేయడంతో పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు.

రూ.3 లక్షల బంగారు ఆభరణాల చోరీ



సుబ్బరాజు నివాసంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, పోలీసులు

కాకినాడ రూరల్: ఇంటి యజమానులు నిద్రిస్తుండగా, దొంగలు చొరబడి రూ.3 లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తిమ్మాపురం రామకృష్ణ నగర్‌లోని ముదునూరి సుబ్బరాజు ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దాటాక దొంగలు ప్రవేశించారు. ఆ సమయంలో సుబ్బరాజు, భార్య ఆ గదిలోనే నిద్రిస్తున్నారు. ఆ పక్క గదిలో వారి అమ్మాయి పడుకుంది. దొంగలు ఏమాత్రం భయపడకుండా సుబ్బరాజు గదిలోకి వచ్చి, టేబుల్‌పై ఉన్న తాళాలను తీసుకుని బీరువా తెరిచి బంగారు ఆభరణాలను చోరీ చేశారు. దొంగలు తిరిగి వెళుతున్న సమయంలో పక్క గదిలోని కుక్క మొరగడంతో సుబ్బరాజుకు మెలకువ వచ్చింది. అప్పటికే దొంగలు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుపై తిమ్మాపురం అదనపు ఎస్సై మూర్తి కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాయి.

అవయవ దానం.. బాధితులకు జీవితం



శివన్నారాయణ (ఫైల్)



ద్వారపూడిలో శివన్నారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ద్వారపూడికి చెందిన నున్న శివన్నారాయణ (శివ) అవయవాలను ముగ్గురికి విజయవంతంగా అమర్చినట్టు ట్రస్ట్ ఆస్పత్రి వైద్యుడు రామకృష్ణ తెలిపారు. ట్రస్ట్ ఆస్పత్రిలో రోగికి శస్త్ర చికిత్స ద్వారా లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేపట్టామని, హైదరాబాద్‌కు చెందిన వైద్య నిపుణుడు సర్జన్ సచిన్ డాగా పాల్గొన్నారన్నారు. ట్రస్ట్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ మూర్తి నేతృత్వంలో వైద్యులు సోమయాజులు, కిశోర్, గణేష్, సురేంద్ర, శ్రీకాంత్, రామకృష్ణ సమష్టిగా అవయవ సేకరణ, అమరిక నిర్వహించారన్నారు. రెండు కిడ్నీలలో ఒకటి విశాఖలో కిమ్స్ ఆస్పత్రిలోనూ, మరో కిడ్నీని ట్రస్ట్ ఆస్పత్రిలో రోగులకు అమర్చామన్నారు. రెండు కళ్లను బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందించామన్నారు. శివ సోదరుడు వీరబాబు, వదిన శిరీష, భార్య విజయలక్ష్మి అవయవ దానం కోసం ముందుకు రావడంతోనే ఇది సాధ్యమైందని, వారికి ధన్యవాదాలు తెలిపారు. కాగా.. ఈ నెల 25 రాజమహేంద్రవరం – ద్వారపూడి రోడ్డులో శివన్నారాయణ ప్రమాదానికి గురయ్యాడు.

మృతదేహానికి నివాళి

కపిలేశ్వరపురం (మండపేట): అవయవాల మార్పిడి ప్రక్రియ అనంతరం శివన్నారాయణ మృతదేహాన్ని ద్వారపూడికి బుధవారం తరలించారు. నియోజకవర్గంలోని పలువురు ద్వారపూడికి చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, పలు పార్టీల నాయకులు కంకటాల మురళీకృష్ణ, పాలిక రమణ, గజ్జి వెంకట రమణ, చింతా శ్రీనివాసరావు, పల్లా సన్యాసిరావు, తెల్లాకుల శివ ప్రసాద్, డాక్టర్ నాయుడు తదితరులు ఉన్నారు.

తీర్థయాత్రలకు వెళితే ఇంటిని దోచేశారు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాజానగరం: ఇంటికి తాళం పెట్టి కుటుంబ సమేతంగా తీర్థయాత్రలకు వెళ్తే, దుండగులు ఆ ఇంటిలో చొరబడి రూ.1.77 లక్షల విలువైన వస్తువులను దోచుకుపోయారు. దివాన్‌చెరువు శివారు రఘునాథపురంలో ఈ ఘటన జరిగింది. ఎస్సై నాగార్జున బుధవారం తెలిపిన వివరాల ప్రకారం .. ఆ గ్రామానికి చెందిన బల్లి వెంకటేశులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 25న తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వెళ్లాడు. దీన్ని గమనించిన దొంగలు ఆ ఇంటి తాళం బద్దలు కొట్టి, దొరికినంత దోచుకుపోయారు. తర్వాత ఉదయం పక్కింటి వాళ్లు ఆ ఇంటి తలుపులు తెరచివుండటాన్ని గమనించి, తీర్థయాత్రలకు వెళ్లిన వారు తిరిగి వచ్చారేమోనని చూశారు. వారి జాడ లేకపోవడంతో ఏదో జరిగి ఉంటుందని భావించి వెంకటేశుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే వెంకటేశులు ఇంటికి వచ్చి చూడగా బీరువాలో భద్రపరిచిన 64 గ్రాముల బంగారు నగలు, 850 గ్రాముల వెండి వస్తువులతో పాటు కొంత నగదు అపహరణకు గురైనట్టుగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై నాగార్జున తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ని రప్పించి, వేలిముద్రలను సేకరించారు.